
సాక్షి
గుంటూరు

సోమవారం । 22 । మే । 2023



కార్మెల్‌మాతకు పూజలు

ఫిరంగిపురం: కార్మెల్ మాతను దర్శించుకునేందుకు గుంతకల్లు, ధర్మవరం, పొద్దుటూరు, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 521.00 అడుగుల వద్ద ఉంది. ఇది 151.1053 టీఎంసీలకు సమానంగా ఉంది.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో ఎంపీ మోపిదేవి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నా రు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎంపీకి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఎంపీకి బహూకరించారు.

భూములపై విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: దళితులకు, దేవదాయశాఖకు మధ్య ఏర్పడిన భూముల వివాదంలో విచారణాధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను నియమించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఆదేశాలు ఇచ్చారు. 2008వ సంవత్సరంలో పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణ సందర్భంగా దాచేపల్లి మండలం ఏలియన్‌పేటకు చెందిన వారు భూములు కోల్పోయారు. నిర్వాసితులైన సుమారు 77 మంది దళితులకు పునరావాసం కింద ఇచ్చిన భూముల విషయంలో దేవదాయ శాఖకు సంబంధించిన భూములుగా ఘర్షణలు తలెత్తటంపై ప్రచురితమైన వార్త కథనాలపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. విచారణ సమయంలో ఇరువర్గాల వారు ఘర్షణలకు తావివ్వకుండా సహకరించి సమస్యను పరిష్కరించే విధంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

నేడు ప్లస్ టూ స్కూళ్లలో మిగిలిన పోస్టులకు కౌన్సెలింగ్

తెలుగు సబ్జెక్టులో 25 పోస్టుల భర్తీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లస్ టూ తరగతుల బోధనకు రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భర్తీ కాగా, మిగిలిన పోస్టుల భర్తీకై సోమవారం గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ జరగనుంది. ఆదివారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ తెలుగు సబ్జెక్టులో ఖాళీలుగా చూపిన 25 పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో రీ-డిప్లాయిమెంట్ పద్ధతిపై భర్తీ చేశారు. కాగా ఇంగ్లిష్, సివిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుతో పాటు ఫిజిక్స్-4, కెమిస్ట్రీ-మూడు, జువాలజీ-మూడు, ఎకనామిక్స్-రెండు, కామర్స్‌లో మూడు చొప్పున పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో హాజరు కావాలని డీఈఓ పి.శైలజ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గుంటూరు డీవైఈఓ కె. సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సీనియర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఇండియాస్ ఆర్కిటెక్చురల్ హెరిటేజ్ పుస్తకం ఆవిష్కరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారతదేశ చారిత్రక వైభవాన్ని తెలియజేస్తూ అద్భుతమైన చారిత్రక ఫొటోలతో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు, చారిత్రక అన్వేషకుడు కేఎస్ వసిఫ్ రూపొందించిన 'ఇండియాస్ ఆర్కిటెక్చురల్ హెరిటేజ్' అనే పుస్తకాన్ని ఇంతియాజ్ ఆవిష్కరించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ మహత్తర వారసత్వ కళా సంపదను రచయిత పుస్తక రూపంలో కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు జి.నారాయణరావు మాట్లాడారు. కార్యక్రమంలో పుస్తక రచయిత వసిఫ్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హై రిస్క్ అయినా.. తగ్గేదేలే!

పొన్నూరుకు చెందిన ప్రసన్న తొలిసారిగా గర్భం ధరించడంతో కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమెకు నెలనెలా వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. కాన్పు సమయానికి ప్రైవేటు వైద్యులు కడుపులో పెద్ద గడ్డ ఉందని, ప్రాణాపాయం ఉన్న నేపథ్యంలో తాము కాన్పు చేయలేమంటూ చేతులెత్తేశారు. ప్రసన్న చిట్టచివరగా గుంటూరు జీజీహెచ్‌కు రావడంతో వైద్యులు హైరిస్క్ కేసుగా గుర్తించి ఆమెకు ప్రత్యేక వైద్య సేవలు అందించి సుఖ ప్రసవం చేశారు. ఆమె, కుటుంబ సభ్యులు జీజీహెచ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడకు చెందిన శ్రీలక్ష్మికి వివాహమై ఏడేళ్లు గడిచినా సంతానం లేకపోవడంతో స్థానికంగా ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రత్యేక చికిత్స తీసుకుంది. సదరు వైద్యులు కాన్పు సమయానికి కడుపులో ట్విన్స్ ఉన్నారని, కాన్పు కష్టమని చేతులెత్తేశారు. శ్రీలక్ష్మిని గుంటూరు జీజీహెచ్‌కు తీసుకు రావడంతో వైద్యులు ప్రత్యేక వైద్య సేవలందించి సుఖ ప్రసవం చేశారు. సంతానం కోసం రూ. లక్షలు ఖర్చు పెట్టినా, ప్రైవేటు వైద్యులు ప్రాణాపాయ స్థితిలో చేతులెత్తేస్తే.. జీజీహెచ్ వైద్యులు అభయమిచ్చి కాన్పుచేశారని ఆమె కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపింది.

క్లిష్టమైన కాన్పులకు భరోసా ఇస్తున్న గుంటూరు జీజీహెచ్

- ఇతర జిల్లాల గర్భిణులకు సైతం జీజీహెచ్‌లో సుఖ ప్రసవాలు
- కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి సైతం వస్తున్న హైరిస్క్ కేసులు



చికిత్స పొందుతున్న గర్భిణులు

గుంటూరు మెడికల్: ఇలా గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన గర్భిణులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన అనేక మంది హైరిస్క్ గర్భిణులు చివరి క్షణంలో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చి జీజీహెచ్ గైనకాలజీ వైద్యుల ప్రత్యేక వైద్య సేవల వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా సుఖ ప్రసవం అవుతున్నారు. జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగంలో ఏడు యూనిట్లు ఉండగా, ఒక్కో యూనిట్‌లో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, నాలుగు నుంచి ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు నిత్యం కాన్పుల విభాగంలో అందుబాటులో ఉండి గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి సుఖప్రసవాలు చేస్తున్నారు. జీజీహెచ్‌లో ప్రతిరోజూ ఓపీ వైద్య విభాగానికి 250 మంది గర్భిణులు, గర్భసంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు చికిత్స కోసం వస్తున్నారు. ప్రతిరోజూ 20 నుంచి 25 కాన్పులు జరుగుతున్నాయి.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం..

గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్యులు మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా వైద్య సేవలందిస్తుండటంతో ఆసుపత్రికి వచ్చిన అనేక మంది గర్భిణులు సుఖప్రసవం అవుతున్నారు. ముఖ్యంగా కాన్పులకు వచ్చే గర్భిణులకు ఓపీ చీటీ కోసం వేచి చూసే పనిలేకుండా నేరుగా లేబర్ రూమ్‌కు తీసుకెళ్లే విధంగా అవకాశం కల్పించారు. జిల్లాలోని టీచింగ్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటుగా పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి సైతం హైరిస్క్ గర్భిణులను గుంటూరు జీజీహెచ్‌కు రెగ్యులర్‌గా రిఫర్ చేస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలకు అనుబంధంగా గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగం ఉండటంతో పీజీ వైద్యులు సైతం నిత్యం గర్భిణులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. రిఫరల్ ఆసుపత్రిగా గుంటూరు జీజీహెచ్ ఉండటంతో ఇతర జిల్లాల గర్భిణులను, కొన్ని సందర్భాల్లో తెలంగాణ నుంచి సైతం హైరిస్క్ వారిని గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొస్తున్నారు.

గత ఏడాది 8,900 కాన్పులు..

గుంటూరు జీజీహెచ్‌లో గైకాలజీ వైద్య విభాగంలో 2019లో 5,823 సాధారణ ప్రసవాలు జరిగాయి. హైరిస్క్ ప్రెగ్నెన్సీలకు సంబంధించి అత్యవసర సిజేరియన్లు 3,873 జరిగాయి.

- 2020లో సాధారణ ప్రసవాలు 3,306 జరగ్గా, హైరిస్క్ ప్రెగ్నెన్సీలకు సంబంధించి అత్యవసర సిజేరియన్లు 3,163 జరిగాయి.
- 2021లో సాధారణ ప్రసవాలు 4,210 జరగ్గా, హైరిస్క్ ప్రెగ్నెన్సీలకు సంబంధించి అత్యవసర సిజేరియన్లు 4,177 జరిగాయి.
- 2022లో సాధారణ ప్రసవాలు 4,260 జరగ్గా, హైరిస్క్ ప్రెగ్నెన్సీలకు సంబంధించి అత్యవసర సిజేరియన్లు 4,163 జరిగాయి.
- 2023లో ఇప్పటి వరకు మొత్తం 2,400 కాన్పులు జరిగాయి.

ప్రతిరోజూ వైద్య సేవలు ..

గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగంలో సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఓపీ వైద్య విభాగంలో గర్భిణులకు సేవలందిస్తున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే గర్భిణులకు కాన్పుల విభాగంలో 24 గంటలూ వైద్య సేవలందిస్తున్నారు.

హైరిస్క్ అయినా సురక్షిత కాన్పే..

గైనకాలజీ వైద్యులు నిత్యం హైరిస్క్ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటూ ఎంత పెద్ద మొత్తంలో రిస్క్ ఉన్నప్పటికీ సురక్షిత కాన్పే లక్ష్యంగా వైద్య సేవలందిస్తున్నారు. లక్షలాది రూపాయల ఖరీదు చేసే వైద్యసేవలన్ని కూడా పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. హెచ్ఐవీ, హెచ్‌సీవీ, టీబీ, గుండె సమస్య, ఇతర అనారోగ్య సమస్యలతో గర్భం ధరించి ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం వచ్చే ప్రతి హైరిస్క్ కేసును చాలెంజ్‌గా తీసుకుంటూ ఎంతో మంది పేద తల్లుల ముఖంలో ఆనందం వెల్లివిరిసేలా చేస్తున్నారు.

సుఖ ప్రసవం చేయడమే లక్ష్యం



పలు జిల్లాలకు చెందిన హైరిస్క్ గర్భిణులను ప్రతిరోజూ గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ విభాగానికి రిఫర్ చేస్తుంటారు. పలువురు గర్భిణులు నేరుగా కాన్పుల విభాగానికి ప్రతిరోజూ వస్తున్నారు. ఎంతటి రిస్క్ ఉన్నా ఏమాత్రం అధైర్యపడకుండా గైనకాలజీ వైద్యులంతా టీమ్ వర్క్‌లా పనిచేసి సుఖప్రసవం చేస్తున్నారు. పీజీ వైద్యులకు సైతం క్లినికల్ నాలెడ్జ్ పెంచేందుకు సీనియర్ వైద్యులు కృషి చేస్తున్నారు.

–డాక్టర్ పోతరాజు జయంతి,
గైనకాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

రూ. 80 కోట్లతో ఎంసీహెచ్ నిర్మాణం



గర్భిణులకు అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతోపాటు, అత్యంత క్లిష్టమైన కాన్పులు సైతం ప్రతిరోజూ చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, జింఖానా సంయుక్త ఆధ్వర్యంలో రూ. 80 కోట్లతో ఎంసీహెచ్ (మాతాశిశు సంరక్షణ వార్డు) నిర్మాణం జీజీహెచ్‌లో జరుగుతోంది. వార్డు నిర్మాణం పూర్తయితే కార్పొరేట్ కంటే మరింత దీటుగా గర్భిణులకు, స్త్రీలకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ నీలం ప్రభావతి,
గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

బాలికపై లైంగికదాడి

తెనాలిరూరల్: చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి 13 ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. మూడు గంటల పాటు తన గదిలోనే ఉంచుకుని అర్ధరాత్రి బాలికను ఇంటికి పంపాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లితోపాటు స్థానిక మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైకుంఠపురం సమీపంలో గల పోతురాజు కాలనీలో నివసించే రాడ్‌బెండింగ్ కార్మికుడు కొప్పుల రాజు అలియాస్ సోగ్గాడు చెడు అలవాట్లకు బానిసయ్యాడు. మనస్పర్థల కారణంగా ఇతడి భార్య, పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఎనిమిదేళ్లుగా కాలనీలో ఒంటరిగా ఉంటున్న రాజు, పిల్లలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, యాచక మహిళలనే టార్గెట్ చేస్తూ తరచూ ఏదో ఒక గలాటా సృష్టిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో 13 ఏళ్ల బాలిక శనివారం రాత్రి 8 గంటల సమయంలో దుకాణానికి వెళ్లి వస్తుండగా, బాలికను పిలిచి డబ్బులు ఇచ్చి సిగరెట్లు, కూల్‌డ్రింక్ తీసుకురమ్మని చెప్పాడు. బాలికనూ రూ.10 ఇచ్చి కొనుక్కోమన్నాడు. తిరిగి దుకాణానికి వెళ్లి వచ్చిన బాలికను తాను ఉండే గదిలోకి తీసుకెళ్లాడు. సుమారు మూడు గంటలపాటు బాలికను గదిలోనే ఉంచిన అతను ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి వేళ ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లిన బాలిక జరిగింది తల్లికి చెప్పింది. స్థానికులతో కలసి రాజు ఉండే గదికి వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి జారుకున్నాడు. ఘటనపై బాలిక తల్లిదండ్రుల తోపాటు స్థానికులంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొప్పుల రాజు దగ్గర్లోని ఒక ప్రార్థన మందిరం కింద గదిలోకి తీసుకెళ్లి వేధించి లైంగికదాడి చేశాడని బాలిక తల్లి వాపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పరిశీలించి వెళ్లారని, బాలికపై దారుణానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లి సహా స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. బాధిత బాలికను పోలీసులు వైద్య పరీక్షల కోసం తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నింటా అగ్రిగామి

- పుడమి పుత్రుల సేవలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
- స్నాతకోత్సవాలకు ముస్తాబైన వ్యవసాయ కళాశాల
- నేటి వేడుకలకు హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



ముస్తాబైన వ్యవసాయ కళాశాల

బాపట్ల: హరిత విప్లవంలో అగ్రగామిగా విరాజిల్లుతున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కొన్ని దశాబ్దాలుగా విశిష్టమైన సేవలు అందిస్తోంది. బాపట్ల వ్యవసాయ కళాశాలలో సోమవారం విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాలు జరగనున్నాయి. 993 మంది విద్యార్థులకు ఈ స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు ప్రదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హరిత విప్లవంలో అద్భుతమైన వంగడాల రూపకల్పన ద్వారా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పుడమి పుత్రుల సేవలో కీలకమైన పాత్రను పోషిస్తోంది. భారతదేశంలోని 74 విశ్వవిద్యాలయాల్లో ఈ యూనివర్సిటీ టాప్ టెన్‌లో తన స్థాయిని పదిలపరుచుకుంది.

అన్నదాతల సేవలో కీలకపాత్ర...

ఈనెల 22న బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిసారిగా యూనివర్సిటీకి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. అన్నదాతకు వెన్నుదన్నుగా విశ్వవ్యాప్తంగా బాపట్ల విశేషమైన ప్రాచుర్యం సంపాదించింది. ఇక్కడి పరిశోధన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు, రైతులకు గణనీయమైన సేవలు అందిస్తున్నాయి. వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, ఆహార విజ్ఞాన కళాశాలలతో పాటు వరి పరిశోధన స్థానం, ఉప్పునీటి పరిశోధన స్థానం, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ వంటి అనేక పరిశోధన స్థానాలకు బాపట్ల జిల్లా కేంద్ర బిందువుగా ఉంది.

78 వసంతాలు దిగ్విజయంగా పూర్తి..

1945లో ఏర్పాటైన బాపట్ల వ్యవసాయ కళాశాల 78 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. దక్షిణ భారతదేశంలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు తర్వాత ఏర్పాటైన తొలి కళాశాల బాపట్ల వ్యవసాయ కళాశాలే.

బీపీటీ వంగడం సృష్టికర్త...

విశ్వవ్యాప్తంగా విరాజిల్లుతున్న బీపీటీ వరి వంగడం వర్సిటీ పరిధిలోని వ్యవసాయ కళాశాల సృష్టించినదే.. ఇప్పుడీ రకం వంగడాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో కోటి ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. హరిత విప్లవానికి పెద్దపీట వేసిన ఈ కళాశాల అద్భుతమైన ఫలితాలతో అగ్రగామిగా ముందుకు సాగిపోతోంది. కళాశాల ప్రాంగణంలో రూ.70 కోట్లతో అధునాతనమైన భవనాలను నిర్మించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 24 నుంచి జూన్ ఒకటో తేదీవరకు జరగనున్న పరీక్షలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 49,771 మంది విద్యార్థులు
- వెల్లడించిన ఆర్ఐఓ జి.సునీత



మాట్లాడుతున్న ఆర్ఐఓ జి.సునీత

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐఓ జి.సునీత పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై ఆదివారం చీఫ్ సూపరింటెండెంట్లు, డీఓలు, కస్టోడియన్లు, స్క్వాడ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్ఐఓ సునీత మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన 100 పరీక్ష కేంద్రాల పరిధిలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ సంవత్సర పరీక్షలకు 36,173 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరగనున్న ద్వితీయ సంవత్సర పరీక్షలకు 13,598 మంది హాజరు కానున్నట్టు చెప్పారు. పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులందరు విధిగా గుర్తింపు కార్డు ధరించాలని, కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా పరీక్షల విధులు, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో గుంటూరు, బాపట్ల జిల్లాల డీవీఈఓ కె.ఆంజనేయులు, హైపవర్ సభ్యుడు బీవీ కృష్ణారెడ్డి, డీఈసీ సభ్యులు టి.శేఖర్ బాబు, జి.బాలమోహన్ దాస్, వైసీహెచ్ పాండురంగారావు, పి.సుధాకర్‌రావు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయి.

క్రీడల్లో గోల్డెన్ 'హ్యాండ్'!

తెనాలి హ్యాండ్‌బాల్ అకాడమీ మెరుపులు

- అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టుకు ఆడిన అకాడమీ క్రీడాకారుడు
- రాష్ట్రం తరఫున జాతీయ పోటీల్లో పాల్గొన్న మరో ఆరుగురు
- యూనివర్సిటీ జట్లకు మరో ముగ్గురు క్రీడాకారులు
- తొమ్మిది నెలల్లోనే అనేక విజయాలు



అకాడమీ క్రీడాకారులు



భారత జట్టుకు ఆడిన జె.మధుబాబు



రాష్ట్ర జట్టులో ప్రతిభ చాటిన రాజేష్



భారత జూనియర్ జట్టు కోచ్‌గా కె.నాగరాజు

తెనాలి: తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో నడుస్తున్న హ్యాండ్‌బాల్ అకాడమీ ఆశించిన ఫలితాలను సాధిస్తోంది. దాదాపు పది నెలల క్రితం ఆరంభమైన అకాడమీ నుంచి ఒకరు ఏకంగా భారత హ్యాండ్‌బాల్ జట్టుకు ఆడగా, ఆరుగురు రాష్ట్ర జట్లకు ఎంపికై జాతీయపోటీలకు ఆడగా, మరో ముగ్గురు యూనివర్శిటీ జట్లకు ప్రాతినిధ్యం వహించటం ఇందుకు నిదర్శనం.

హ్యాండ్‌బాల్‌లో గణనీయమైన పురోగతి..

క్రీడారంగంలోనూ జైత్రయాత్ర సాగించిన చరిత్ర కలిగిన తెనాలి, కొంతకాలంగా హ్యాండ్‌బాల్ క్రీడలో గణనీయమైన పురోగతిని సాధిస్తున్న విషయం తెలిసిందే. ఆ క్రమంలో దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేనివిధంగా హ్యాండ్‌బాల్ క్రీడా అకాడమీ గతేడాది ఆగస్టు ఒకటిన ఇక్కడి అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో ఆరంభమైన విషయం తెలిసిందే. స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ హ్యాండ్‌బాల్ అకాడమీని, ఆ తర్వాత రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా అధికారికంగా ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దక్షిణ భారత దేశంలో ఈ తరహాలో ఆరంభించిన తొలి క్రీడా అకాడమీగా ప్రత్యేకతను సంతరించుకుంది.

అన్ని వసతులతో..

'శాప్' ఎండీ ఎస్.ప్రభాకరరెడ్డి ప్రోత్సాహం, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అందుబాటులోకి తెచ్చిన వసతులు, దాతల వితరణతో తెనాలిలో హ్యాండ్‌బాల్ అకాడమీ రూపుదాల్చింది. ఇక్కడి స్టేడియంలో రూ.35 లక్షల వ్యయంతో మొదటి అంతస్తును నిర్మించి, క్రీడాకారుల బసకు తగిన డార్మెటరీ, డైనింగ్‌హాలు, కిచెన్, ఆరు వాష్ రూమ్స్, స్టోర్‌రూమ్ సిద్ధంచేశారు. 'శాప్' వీరికి అవసరమైన బెడ్స్‌ను, క్రీడాపరికరాలను సమకూర్చింది. తెనాలి డబుల్‌హార్స్ మినపగుళ్ల వారి సౌజన్యంతో ఈ అకాడమీని ప్రారంభించారు. విజయనగరం, వైజాగ్, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్నుంచి నలుగురు చొప్పున, కడప, చిత్తూరు, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల్నుంచి ఒక్కొక్కరు ఎంపికకాగా, గుంటూరు జిల్లానుంచి ఏకంగా ఎనిమిదిమంది ఎంపికయ్యారు.

నైపుణ్య క్రీడాశిక్షణ..

క్రీడాకారులు స్టేడియంలో ఉంటూ, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మూడేసి గంటల చొప్పున సాధన చేస్తున్నారు. అనుభవజ్ఞుడైన 'శాప్' కోచ్ కె.నాగరాజు సారథ్యంలో వీరికి నైపుణ్యమైన క్రీడాశిక్షణ లభిస్తోందని చెబుతున్నారు. వీరంతా పేద కుటుంబాల్నుంచి వచ్చినవారే. ఇంటర్ సెకండియర్, డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులే వీరంతా. వీరికి ఉదయం అల్పాహారంతోపాటు రాగిజావ, పండు ఇస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం ఉంది. వారంలో రెండురోజులు నాన్‌వెజ్ ఆహారం, మరో రెండురోజులు గుడ్డును మెనూలో చేరుస్తున్నారు.

భారతజట్టుకు ఎంపిక..

పదినెలలకు చేరువ కావస్తున్న అకాడమీలోని క్రీడాకారులు అద్భుత ప్రావీణ్యాన్ని సంపాదించారు. అకాడమీకి చెందిన జె.మధుబాబు ఏకంగా భారత జట్టుకు ఎంపికవటం విశేషం. గోల్‌కీపింగ్‌లో విశేష ప్రతిభ, నైపుణ్యం కలిగిన మధుబాబు, బల్గేరియా రాజధాని సోఫియాలో గత నెల 25 నుంచి 30వ తేదీవరకు జరిగిన మెన్స్ ఇంటర్నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో భారత జట్టు గోల్‌కీపర్‌గా అసమాన ప్రతిభను ప్రదర్శించాడు. భారత జట్టు తృతీయస్థానం దక్కించుకోవటంలో మధుబాబు నైపుణ్యం తోడ్పడింది.

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు నిలయం..

విజయవాడలో జరిగిన జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ జట్టులో అకాడమీ క్రీడాకారులు ఎ.రాజేష్, షేక్‌షావలి ఆడారు. వీరితోపాటు హైదరాబాద్‌లో గత డిసెంబరులో జరిగిన నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ జట్టు కాంస్య పతకం సాధించింది. ఈ పోటీల్లో ఆడిన ఆంధ్ర జట్టులో అకాడమీ నుంచి నవీన్‌కుమార్, శ్యాంసుందర్ ఆడారు. సత్య, రాజేష్ అనే మరో ఇరువురు జాతీయ పోటీల్లో సబ్‌జూనియర్స్ రాష్ట్ర జట్టుకు ఆడారు. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న అకాడమీ క్రీడాకారుడు శేఖర్, రాయలసీమ యూనివర్శిటీ తరఫున అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆడాడు. కాలేబు అనే క్రీడాకారుడు, కై లాస్‌లు ఆంధ్రా యూనివర్శిటీ తరఫున అదే పోటీల్లో ఆడారు. అకాడమీలోని సగం మంది అంటే పదిమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడటం అకాడమీకి గర్వకారణమని కోచ్ కె.నాగరాజు అన్నారు. బెహరైన్‌లో జరిగిన 9వ ఆసియా గేమ్స్‌లో భారత జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టుకు కోచ్‌గానూ నాగరాజు వ్యవహరించారు. అకాడమీ కొనసాగితే ముమ్ముందు మరిన్ని విజయాలను నమోదు చేస్తుందనటంలో సందేహం లేదనేది క్రీడాకారుల భావన.

సొసైటీ నిధుల అవకతవకలపై విచారణ పూర్తి

కారంచేడు: సొసైటీ నిధుల అవకతవకలపై అధికారులు విచారణ పూర్తి చేశారు. 2014, 2015, 2016, 2017 ఆర్థిక సంవత్సరాల్లో కారంచేడు సహకార పరపతి సంఘంలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. 2013-2018 మధ్య కాలంలో కారంచేడు సొసైటీ అధ్యక్షుడిగా యార్లగడ్డ అక్కయ్యచౌదరి విధులు నిర్వహించాడు. ఈ కాలంలో సొసైటీకి చెందిన లక్షల నిధులు దారి మళ్లాయి. వీటిపై అనేకసార్లు ఉన్నత స్థాయి విచారణలు జరిగాయి. అప్పటి పాలకవర్గంతో పాటు, సిబ్బందిపైన వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో నిధుల దుర్వినియోగంలో అధ్యక్షుడిదే బాధ్యతగా ఉత్తర్వులు వచ్చాయి. ఎరువుల వ్యాపారంలో నిధులు ఖాతాలో జమ కాలేదని ఆడిట్ చేశారు. ఈనివేదిక ఆధారంగా సహకార చట్టం 52 ప్రకారం ఎట్టకేలకు పైమూడేళ్ల కాలంలో సొసైటీ నిధుల నుంచి రూ 26.57 లక్షలు గోల్‌మాల్ జరిగాయి. అప్పటి సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న యార్లగడ్డ అక్కయ్యను 2017 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 18 శాతం వడ్డీతో సొసైటీకి చెల్లించేలా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్, బాపట్ల జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ అయిన కే యలమందారావు ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

పొన్నూరులో 13.2 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 13.2 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తుళ్ళూరు మండలంలో 11.4 మి.మీ., పెదకాకాని 10.8, పెదనందిపాడు 9.6, మంగళగిరి 4.4, కాకుమాను 4.2, మేడికొండూరు 3, తాడేపల్లి 2.4, తాడికొండ 2, చేబ్రోలు మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

న్యాయవాదిపై దాడి.. ఏడుగురిపై కేసు

కొల్లూరు: న్యాయవాదిపై దాడి కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మండలంలోని పెసర్లంకలో ఓ పొలం విషయంలో కొన్నేళ్లుగా వివాదాలు నెలకొనడంతో కోర్టులో కేసులు నడిచాయి. ఇటీవల కోర్టు సాగు చేసుకునేందుకు సాత సుబ్బారావుకు అనుమతులు ఇచ్చింది. అతను సాగు చేసుకునే క్రమంలో ఇరువర్గాల నడుమ మళ్లీ గొడవలు జరుగుతుండటంతో కోర్టు సాత సుబ్బారావు తరఫున కౌలు వేలం నిర్వహించాలని ఆదేశించింది. కోర్టు రిసీవర్ జగదీశ్వరాంబ, వేలం నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న సమయంలో ఆమె వెంట వచ్చిన సాత సుబ్బారావుకు చెందిన న్యాయవాది వద్ద ప్రాక్టీస్ చేస్తున్న షేక్ ఖాదర్‌హుసేన్‌తో కొందరు గొడవకు దిగారు. పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు నెట్టుకుంటూ వెళ్లి దాడికి యత్నించారు. తనపై జరిగిన దాడిపై లాయరు చేసిన ఫిర్యాదు మేరకు పెసర్లంకకు చెందిన సింగం కృష్ణప్రసాద్, సింగం శ్రీనివాసరావు, గరికపాటి దుర్గప్రసాద్, వెలివల శ్రీనివాసరావు, వెలివల వెంకటేశ్వరరావు, వెలివల వజ్రమ్మ, వెలివల విజయ లక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజీవ్ శామ్యూల్‌కుమార్ తెలిపారు.

విదేశీ విద్యా యోగ ప్రాప్తిరస్తు

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం
- 379 యూనివర్సిటీలు, ఇనిస్టిట్యూట్లలో వివిధ కోర్సుల్లో చేరే అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీలకు, కాపు విద్యార్థులకు వరం
- జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు



నెహ్రూనగర్: ఉన్నత వర్గాలకు చెందిన వారే ఇప్పటి దాకా విదేశాల్లో చదువుల్లో రాణిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదువుకోవాలంటే కలగానే మిగిలిపోతోంది. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వారి కలల్ని సాకారం చేసేందుకుగాను జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని తీసుకువచ్చారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ ర్యాంకింగ్స్ 2023 ప్రకారం టాప్ 50 ఇనిస్టిట్యూట్లు, యూనివర్సిటీల్లో 21 సబ్జెక్టులు(బోర్డ్ క్యాటగిరీ ఆఫ్ సబ్జెక్ట్స్)తో పాటు దాదాపు 379 యూనివర్సిటీలు, సంస్థల్లో విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోంది.

ఆర్థిక సాయం పొందేందుకు అర్హత కలిగిన సబ్జెక్టులు ఇవి

అకౌంటింగ్, ఫైనాన్స్, వ్యవసాయం, డిజైన్, మానవీయ శాస్త్రాలు, బయోలాజికల్ సైన్సెస్, వ్యాపారం, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్, మీడియా వ్యూహం, కంప్యూటర్ సైన్సెస్, ఎకనామిక్స్, ఎకనామెట్రిక్స్, విద్య, శిక్షణ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్, మైనింగ్, ఇంజినీరింగ్ పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్, చట్టం, మెడిసిన్, సహజ శాస్త్రాలు, భౌతిక శాస్త్రం, ఖగోళ శాస్త్రాలకు చెందిన సబ్జెక్టుల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.

21 మందికి నిధులు విడుదల

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద విదేశాల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న 21 మంది విద్యార్థులకు 03-02-2023 నాటికి రూ.1,21,01,304 మంజూరయ్యాయి.

అర్హతలు

- క్యాలిఫైయింగ్ కోర్సుల్లో 60శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకం కింద అర్హులు.
- ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకునే ఇంటర్మీడియట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలి.
- జగనన్న విదేవీ విద్యా దీవెన పథకం కింద అర్హులైన, ఎంపికైన వారికి వంద శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.125 లక్షలు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ) విద్యార్థులకు ఏది తక్కువైతే అది మంజూరు చేస్తారు.
- ఇతర కేటగిరీల్లో ఉన్న విద్యార్థులకు వంద శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.100లక్షలు... వీటిల్లో తక్కువైతే అది మంజూరు చేస్తారు.
- కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.8లక్షలు మించకూడదు.
- నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నాటికి గరిష్ట వయస్సు 35 సంవత్సరాలు మించకూడదు.
- ఆదాయ ధ్రువీకరణ పత్రం పథకం కోసం నిర్దేశించిన ఫార్మాట్‌లో మాత్రమే ఉండాలి.

జూన్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలి



జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపుల విద్యార్థులకు పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు అభ్యసించేందుకు గాను ప్రభుత్వం ఆర్థిక సాయం సాయం అందిస్తుంది. అర్హులైన విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా httpr: jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– డి. మధుసూదనరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసుల్ని ఆదేశించారు. శని,ఆదివారాలలో రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 96మందిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో డ్రైవ్ కొనసాగించామని చెప్పారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కేసుల్ని నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తామన్నారు. ఈనెల ఒకటి నుంచి ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 695 మందిని అదుపులోకి తీసుకుని వారిపై 685 కేసులు నమోదు చేశామని తెలిపారు. మహిళలు, పిల్లలు తిరిగే ప్రదేశాలలో, రోడ్ల పక్కన, చెట్ల కింద, వాహనాలలో, బహిరంగ ప్రదేశాలలో ఎవరైనా మద్యం సేవిస్తున్నా, ప్రజా జీవనానికి భంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నా వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్లు 100, 112, హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులపై స్పష్టత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు కోరారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లస్‌టూ స్కూళ్లలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు సర్వీసు నిబంధనల మేరకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉండగా, ఒక ఇంక్రిమెంట్‌తో నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గత జనవరిలో రూ.2500 అలవెన్సుతో ఉపాధ్యాయుల్ని ఉన్నత పాఠశాలల్లో తాత్కాలికంగా సర్దుబాటు చేశారని, 30 శాతం కోటా కింద వెళ్లిన సంబంధిత ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉద్యోగోన్నతులు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌ను మాన్యువల్ విధానంలో నిర్వహిస్తున్న దృష్ట్యా, ఉపాధ్యాయుల నుంచి ముందుగానే ఆప్షన్ తీసుకోవాల్సిన అవసరం లేదని, కౌన్సెలింగ్ సమయంలో నచ్చిన పాఠశాలల్ని వారు కోరుకుంటారన్నారు. బదిలీల విషయంలో న్యాయం జరిగే విధంగా సమగ్రమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అన్ని రకాల ప్రాధాన్యతాక్రమాల్ని పరిగణలోకి తీసుకుని పాయింట్ల కేటాయింపు జరపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగోన్నతులు, బదిలీల విషయంలో ఒకే విధానాన్ని అమలు పర్చాలని విన్నవించారు. సమావేశంలో ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు గేరా మోహనరావు, డి. పెదబాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్. వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లేశ్వరరావు మృతి



మంగళగిరి: జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు (74) గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగరంలోని పార్కు రోడ్డులో నివాసం ఉంటున్న పుల్లేశ్వరరావు ఆదివారం తెల్లవారుజామున నివాసంలో గుండెపోటుకు గురై అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గంమధ్యలోనే మృతి చెందారు. గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పవర్ లిఫ్టర్లకు పుల్లేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. నగరంలోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో నేటికీ ఆయన పలువురు పవర్ లిఫ్టర్లకు శిక్షణ ఇస్తున్నారు. పుల్లేశ్వరరావు ఆకస్మిక మృతిపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పుల్లేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పవర్ లిఫ్టింగ్ కోచ్‌లు ఎస్‌కే సంధాని, ఖమ్రుద్దీన్‌లతో పాటు పలువురు లిఫ్టర్లు పుల్లేశ్వరరావు ఆకస్మిక మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

ప్రియుడితో మనస్పర్థలు.. యువతి ఆత్మహత్య



రమ్య మృతదేహం

తెనాలి రూరల్: ప్రియుడితో మనస్పర్థలు కారణంగా యువతి ఆత్మహత్యకు పాల్పడింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన తురుమెళ్ల రమ్య(22) పలు ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటుంది. తల్లిదండ్రులకు దూరంగా గత కొద్ది కాలంగా తెనాలిలో ఒంటరిగా నివాసం ఉంటోంది. విజయవాడ, హైదరాబాద్, ఇతర ప్రముఖ నగరాల్లో ఈవెంట్లు చేసుకుంటూ నందులపేటలోని మూత బావి వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. ఈ క్రమంలో పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన సూర్యతేజతో పరిచయం ఏర్పడగా మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఇద్దరి మధ్య తరచూ మనస్పర్థలు రావడంతో సూర్యతేజ రమ్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రమ్య తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శనివారం రాత్రి తల్లికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. తిరిగి ఫోన్ చేసినప్పటికీ ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో వారు తెనాలి చేరుకుని చూడగా ఇంట్లోనే రమ్య ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి సంబంధించిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ ఎస్. వెంకట్రావు తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని చెప్పారు. తల్లితో ఫోన్ మాట్లాడుతున్న సమయంలోనే రమ్య ఆత్మహత్య పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వార్షిక గ్రాంటు రెట్టింపు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలల నిర్వహణకు కేటాయిస్తున్న వార్షిక గ్రాంటును రెట్టింపు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవలింగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో పాఠశాలకు గ్రాంట్ రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు రావాల్సి ఉండగా, గత విద్యా సంవత్సరంలో 20 శాతం చొప్పున రెండుసార్లు విడుదల చేశారని తెలిపారు. నిధుల్ని కూడా కొంత మంది హెచ్‌ఎంలు డ్రా చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని తరగతులకు విద్యుద్దీకరణ చేపట్టి తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లుతో పాటు మినరల్ కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్స్ ఏర్పాటు చేసిన దృష్ట్యా విద్యుత్ బిల్లుల చెల్లింపుకే నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు ఖర్చవుతోందని తెలిపారు. పాఠశాలల నిర్వహణ ఖర్చులు పెరిగిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం గ్రాంట్స్ రెట్టింపు చేసి విద్యా సంవత్సరం ముందే విడుదల చేయాలని ఆయన కోరారు. విద్యుత్ బిల్లులు చెల్లింపుల్లో ప్రభుత్వ పాఠశాలలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాలీద్, మక్కెన శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, కార్యదర్శి టి.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ డి. శివ శంకరరావు, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, ఎండీ. ఖుద్దూస్ పాల్గొన్నారు.

గురు భక్తికి నిదర్శనం ఆంజనేయస్వామి

మంత్రి మేరుగ నాగార్జున



వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

మోపర్రు(వేమూరు): గురు భక్తికి అంజనేయస్వామి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గురు భక్తి గల దేవుడు ఆంజనేయస్వామి అని, అందువల్ల ప్రతి గ్రామంలో స్వామి విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులు పూజించడం చేస్తారని తెలిపారు. అనంతరం మోదుకూరి హరిబాబు అధ్వర్యంలో అన్నదానం చేశారు. బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందనాగ్, గాజుల మోహన్, కంఠమనేని శ్రీనివాసరావు, ఒలేటి శివాజీ, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విష్ణుమొలకల వెంకటేశ్వరరావు అజయ్‌బాబు, గాజు చినభాను, కొండ పల్లి వినయ్, ఎస్ డేవిడ్‌రాజు, చేకూరి లక్ష్మయ్య చౌదరి, అంబటి రామోహనరావు, కోసరాజు నాని, గేరా ప్రతాప్, కత్రగడ్డ భవాని పాల్గొన్నారు.

హిందూ ధర్మ సంరక్షణకే శంఖారావం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శివస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నగరంపాలెం: హిందూ సమాజం, ధర్మం కోసమే శంఖారావం కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి తెలిపారు. హిందూ ధర్మ దీక్షా సేవక్, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ వాసవీ క్లాత్ మార్కెట్ సమీపాన ఉన్న చత్రపతి శివాజీ ప్రాంగణంలో హైందవ ధర్మ శంఖారావం నిర్వహించారు. తొలుత శివపార్వతులకు పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శంఖారావాన్ని ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల్లోని పలు పీఠాల స్వామీజీలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు వేదికపై ఆశీనులయ్యారు. శివస్వామి మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిల్లో దేవాలయాలు కేంద్రంగా వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ హితం కోసం, శ్రేయస్సు కోసం సందేశాన్ని ఇచ్చేందుకు శంఖారావం చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా హిందూ ఐకమత్యాన్ని సమాజానికి తెలియజేద్దామని పిలుపునిచ్చారు. సనాతన హిందూ ధర్మ సందేశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా అన్ని మతాల్ని సమానంగా చూడాలని కోరారు. రానున్న రోజుల్లో లక్ష మందితో శంఖారావం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఏపీ అధ్యక్షుడు శ్రీ కృష్ణమాచార్యులు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని రక్షించాలని కోరారు. సేవక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇక్కుర్తి సదాశివరావు మాట్లాడుతూ మతం మారితే కుటుంబానికి, దేశానికి నష్టాలు ఉన్నాయని తెలిపారు. సంఘటితంగా ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాలని చెప్పారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆత్మానందస్వామి (తెలంగాణ), రుద్ర యోగేశ్వరానందస్వామి, బెనారస్‌స్వామి, చిదంబరస్వామి, ప్రభులింగాస్వామి (కర్ణాటక), భవానీస్వామి (తమిళనాడు), గజల్ శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, శాసనమండలి విప్ జంగా కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, పాతూరి నాగభూషణం, జూపూడి రంగరాజు, పలు పీఠాధిపతులు, స్వామీజీలు, భక్తులు పాల్గొన్నారు.

హరికథా కళా రూపానికే మకుటాయమానం

పద్మశ్రీ సచ్చిదానందశాస్త్రి



సభలో మాట్లాడుతున్న సచ్చిదానంద శాస్త్రి

అద్దంకి: తనకు దక్కిన పద్మశ్రీ పురస్కారం హరికథా కళారూపానికే మకుటాయమానమని హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి అన్నారు. పట్టణంలోని హరిహర గోకుల క్షేత్రంలో సాహితీ మిత్రమండలి అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన పద్మశ్రీ కోట సచ్చిదానందశాస్త్రికి పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ తరఫున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి కుటుంబ సభ్యులు జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. సచ్చిదానందశాస్రి మాట్లాడుతూ తనకు లభించిన పద్మశ్రీ పురస్కారం కళారూపాన్ని పోషించిన వారందరికీ దక్కుతుందన్నారు. పుట్టిన నేలపై తాను పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. సచ్చిదానందశాస్త్రి హరికథకు చేసిన సేవలు, ఆయన పుట్టుపూర్వోత్తరాలను వారణాసి రఘురామశర్మ సభికులకు తెలిపారు. అనంతరం పట్టణంలోని సాహితీ సాంస్కృతిక సంఘాల వారంతా సచ్చిదానంద శాస్త్రిని సన్మానించారు. జీవిత సాఫల్య పురస్కారం కింద రూ.21,116 నగదు బహుమతి, పట్టు వస్త్రాలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. సభానంతరం సచ్చిదానందశాస్త్రిని పుట్టంరాజు కుటుంబ సభ్యులు సన్మానించారు.

సత్తెన్న చిరస్మరణీయులు

మంత్రి అంబటి రాంబాబు



సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నాటి సత్తెన్న పేరే నేటి సత్తెనపల్లి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి గడ్డ ఎత్తిన సత్తెన్న విగ్రహావిష్కరణ జరిగి నెలరోజులైన సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవ తీసుకొని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ నడిబొడ్డున సత్తెన్న విగ్రహావిష్కరణ ద్వారా ఆయన చారిత్రక నేపథ్యం చిరస్థాయిలో నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. వడ్డెర సంఘ నాయకులు మంత్రి అంబటి రాంబాబుకు సత్తెన్న జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, వడ్డెర సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు, వడ్డెర సంఘ నాయకులు చెంబేటి శివ రామకృష్ణ, బత్తుల సాంబశివరావు, కందుల నాగేశ్వరరావు, కొమెర శివశంకర్, మల్లెల పాపారావు ఉన్నారు.

పల్నాటి చరిత్రను పరిరక్షించాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: పల్నాటి చరిత్ర, దాని ప్రభావాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లాలో అఖిలపక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. మండలంలోని గామాలపాడులో నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయం పునఃనిర్మాణంతో పాటు ఉప దేవాలయాల నిర్మాణంపై చర్చించారు. ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ జూన్ 7న దేవాలయాల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయం పరిధిలోని 18 ఎకరాల భూమిని బాగు చేశామని, ప్రముఖ శైవక్షేత్రంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేవాలయాల నిర్మాణం ఒక వైపు పల్నాటి చరిత్ర రాబోయే తరాలకు తెలిసేలా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.100 కోట్లతో పనులు చేపట్టాలని అంచనా వేసినట్లు చెప్పారు. ప్రభుత్వం సాయంతో పాటుగా దాతలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయానికి నాలుగు వైపులా గోపురాల నిర్మాణం కూడా చేపడతామని చెప్పారు. సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, కౌన్సిలర్లు షేక్ షరీఫ్, వందనపు వెంకట్రామయ్య, స్థానికులు మాశెట్టి బుజ్జి, కుందురు తిరుపతిరెడ్డి, బత్తుల వెంకయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.